# ముగిసిన గ్రూప్-3 పరీక్ష



ఆదిలాబాద్‌లో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా


ఎదులాపురం, నవంబర్ 18 : టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష రెండో రోజైన సోమవారం ప్రశాంతంగా ముగిసింది. 10,255 మంది అభ్యర్థులకు 6,524 మంది హాజరు కాగా 3,731 మంది గైర్హాజరయ్యారు. జైనథ్ మండలంలోని పిప్పరవాడ అభ్యుదయ పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాలను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేశారు.

## నిర్మల్‌లో కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నిర్మల్ అర్బన్, నవంబర్ 18 : నిర్మల్ జిల్లాలో గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏ ర్పాటు చేసిన కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశా రు. 8,124 మంది అభ్యర్థులకు 4,665 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 3,459 మంది గైర్హాజరయ్యారు. సగటున 57.42 శాతం హాజరయ్యారు.



నిర్మల్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్



### రైతులను కాంగ్రెస్ నిండా ముంచింది..



ఎన్నికలప్పుడు రైతుభరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు దాట వేస్తున్నారు. నేను మూడెకరాల్లో పత్తి వేశా. దిగుబడి సరిగా లేక, మద్దతు ధర రాక పంటను తీసివేసి యాసంగిలో శనగ సాగు చేస్తున్నారు. సాగు కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకొచ్చా. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు డబ్బులు వచ్చేవి. ఇప్పుడు రెండు సీజన్‌లు అయినా పైసల జాడలేదు.

*- యాదగిరి, రైతు, పొన్నారి, తాంసి మండలం*

తాంసి మండలంలోని పొన్నారిలో సాగవుతున్న శనగ పంట



# రైతుకు భరోసా ఏదీ?

## వానకాలం పెట్టుబడి ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

- యాసంగి ప్రారంభమైన సాయం ఊసెత్తని రేవంత్‌రెడ్డి
- డబ్బుల కోసం దళారుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- కేసీఆర్ హయాంలో డబ్బులు వచ్చాయని గుర్తు చేసుకుంటున్న అన్నదాతలు

ఆదిలాబాద్, నవంబర్ 18(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతుభరోసా పథకంలో భాగంగా రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున పంట పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించింది. ఇప్పటికే వానకాలానికి సంబంధించి రైతు భరోసాను ఎగ్గొట్టింది. యాసంగి సీజన్ ప్రారంభమైనా సాయం అందకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సి వస్తున్నది. ఇప్పటికే సోయా, పత్తి చేతికి రాగా రైతులు యాసంగి సాగులో భాగంగా శనగ, గోధుమ, జొన్న పంటలు వేస్తారు. పత్తికి మద్దతు ధర లేకపోవడం, తేమ ఎక్కువ ఉందనే సాకుతో సీసీఐ కొనుగోళ్లు జరపకపోవడంతో రైతులు పంటను ఇండ్ల వద్దనే నిల్వ ఉంచుతున్నారు. పంటను అమ్మకపోవడంతో రైతుల చేతిలో డబ్బులు లేవు. సోయా డబ్బుల పంపిణీలో కూడా జాప్యం జరుగుతున్నది. సాగు కోసం పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు పెట్టుబడి డబ్బులు కోసం దళారుల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు రైతులు అధిక వడ్డీలకు అప్పు తీసుకొచ్చి సాగు చేస్తున్నారు.

### బీఆర్ఎస్ పాలనలో ఠంఛన్‌గా డబ్బులు

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన రైతుబంధు పథకం అన్నదాతల పాలిట వరంగా మారింది. జిల్లాలో 1,63,359 మంది రైతులు ఉండగా.. ఎకరాకు రూ.5 వేల చొప్పున పెట్టుబడి సాయం కేసీఆర్ అందించారు. ఒక్క సీజన్‌ను రూ.276.19 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. సాగులో భాగంగా విత్తనాలు, ఎరువుల కోసం ఆర్థిక ఇబ్బందులు పడే రైతులకు రైతుబంధు డబ్బులు ఉపయోగపడేవి. కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు రూ.5 వేల చొప్పున వానకాలం, యాసంగి సీజన్‌లకు రూ.10 వేలను పంపిణీ చేసింది. సీజన్‌కు ముందుగానే డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేవి. దీంతో సీజన్‌కు ముందుగానే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసి సకాలంలో విత్తనాలు వేసేవారు. పంటలకు ఎరువులను వేయడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉండేవి. విత్తనాల, ఎరువుల దుకాణాదారులు రైతుబంధు డబ్బులు వస్తాయనే నమ్మకంతో ఉద్దెర ఇచ్చేవారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన రైతుబంధు పథకం అన్నదాతలకు అండగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని కాపీ కొట్టి కిసాన్ సమ్మాన్ యోజన అనే పథకాన్ని ప్రారంభించింది. దేశంలోని పలు రాష్ట్రాలకు రైతుబంధు పథకం ఆదర్శంగా నిలిచింది.

# మంత్రి పదవికి నోట్ల కట్టలు!

## మంచిర్యాల నుంచి మహారాష్ట్ర ఎన్నికలకు డబ్బులు!

- ఓ మంత్రి క్యాంపెయిన్ చేస్తున్న సెగ్మెంట్లు చూసుకుంటానని ఓ ఎమ్మెల్యే హామీ
- ప్రతిఫలంగా మంత్రి పదవి కోసం పట్టు
- ఆయనకు ఇస్తే ఇవ్వండి.. నాకు పదవి కావాల్సిందే.. అని మరో ఎమ్మెల్యే
- మంచిర్యాల జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిన వ్యవహారం




మంచిర్యాల, నవంబర్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చే వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. నిన్న, మొన్నటి వరకు మంచిర్యాల నుంచి మంత్రి అవ్వడానికి పోటీ పడుతున్న ఎమ్మెల్యేలను కాదని పక్కా జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్యేకు పదవి ఇస్తారని ఆ పార్టీ నాయకులే చెప్పుకొచ్చారు. తాజాగా మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో కొత్తవాదన తెరపైకి వచ్చింది. మంచిర్యాల జిల్లా నుంచి గెలిచిన ఎమ్మెల్యేలలో బాగా డబ్బులున్న ఓ ఎమ్మెల్యే మహారాష్ట్ర ఎన్నికల కోసం వందల కోట్లు దారాదత్తం చేస్తున్నారట. ప్రతి ఫలంగా ఆయన మంత్రి పదవి కోసం పట్టుపడుతున్నారని మరో ఎమ్మెల్యే వర్గం నాయకులు ప్రచారం చేస్తున్నారు. 'మా సార్‌కు పైసలు లేవు. పార్టీ కోసం కష్టపడ్డాడు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని నిలబెట్టిండు. న్యాయంగా చూసుకుంటే మా ఎమ్మెల్యేకు తప్ప మరొకరికి మంత్రి పదవి ఇవ్వొద్దు. కానీ.. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చి బాగా డబ్బున్న ఎమ్మెల్యే పదవి కోసం కోట్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. మా సార్‌కు పదవి రాకపోతే ఏం చేసుడో అర్థమైతలేదు' అని ఆ నాయకులు వాపోతున్నారు. అందుకే మహారాష్ట్రలో ఎన్నికలైతే మన జిల్లాలో హడావుడి కనిపిస్తుందన్నారు. అన్ని వాహనాలు, అంత మందిని ఎన్నికల కోసం తీసుకుపోతున్నారంటే.. దానికి కారణం ఆ నోట్ల కట్టలు కట్టే ఎమ్మెల్యే హస్తం ఉందని మరో ఎమ్మెల్యే అనుచరులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు మంచిర్యాల జిల్లాలో ఈ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది.

### ఓ మంత్రి ప్రచారం చేస్తే నియోజకవర్గాల్లో ఖర్చు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణకు చెందిన ఓ మంత్రి స్టార్ క్యాంపెనయిర్‌గా ఉండి ప్రచారం చేస్తున్న నియోజకవర్గాల్లో సదరు ఎమ్మెల్యే ఇస్తున్న డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు కాంగ్రెస్ లీడర్లే చెప్తున్నరు. డబ్బులు ఇక్కడి నుంచి తీసుకుపోకుండా మహారాష్ట్రలో తన కున్న పరిశ్రమలు, వ్యాపార సముదాయాల నుంచే ఈ డబ్బులు అప్పగిస్తున్నారని ఆ నాయకులు ఆరోపిస్తున్నరు. ఆ మంత్రి ప్రచారం చేస్తే నియోజకవర్గాల్లో డబ్బు ల పంపిణీ బాధ్యత కూడా సదరు ఎమ్మెల్యేనే తీసుకున్నారని చెప్తున్నరు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఇస్తున్న కోట్ల రూపాయలు, పక్క రాష్ట్రంలో పెడుతున్న ఖర్చు గురించి పార్టీలో 'ముఖ్య'మైన నాయకుడు అధిష్టా నం దృష్టికి తీసుకువెళ్లడం ఆయనకే మంత్రి పదవి కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నారని జిల్లాలోని కాంగ్రెస్ లీడర్లు చెప్తున్నారు. పార్టీ కోసం తెలంగాణలో పని చేసిన ఎమ్మెల్యేను కాదని పక్క రాష్ట్రం ఎన్నికల్లో డబ్బులు కుమ్మరించే వారికి పదవి ఇవ్వడం వెనుక మతలబేంటని ప్రశ్నిస్తున్నారు. కాగా.. ఈ విషయం తెలిసిన మా సార్ కూడా వెళ్లి అధిష్టానాన్ని కలిశారని చెప్తున్నారు. డబ్బులున్న బడా లీడర్‌కు మంత్రి పదవి ఇస్తే ఇచ్చుకోండి. పార్టీ కోసం కష్టపడిన నాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే అంటూ స్పష్టంగా చెప్పి వచ్చారట. కాకపోతే ఒకే జి ల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవు లు ఇవ్వడం కుదరదని అధిష్టానం చెప్పినట్లు సమాచారం. అదే జరిగితే ఇన్ని రోజులు జిల్లా కాంగ్రెస్‌లో నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరుతాయనడంలో సందేహం లేదు.

### ఏటూ తేల్చని అధిష్టానం

మంత్రి పదవి విషయంలో రోజుకో ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతుంటే.. కాంగ్రెస్ అధిష్టానం ఊరించి ఉసూరుమనిపిస్తుందే తప్పా ఎవరు మంత్రి అన్న విషయంలో క్లారిటీ ఇవ్వడం లేదు. దీంతో హస్తం పార్టీ క్షేత్రస్థాయిలోని కార్యకర్తలు నారాజ్ అవుతున్నరు. ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య నలిగిపోతున్నరు. మంత్రి పదవి ఆశించి భంగపడుతున్న ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా ఉండే నాయకులే ఈ విషయంపై తీవ్రమైన చర్చ లేపుతున్నారు. ఇలా చేస్తేనైనా అధిష్టానం వరకు విషయం వెళ్లి కష్టపడిన వారిని గుర్తిస్తుందో ఏమోనని ఆశపడుతున్నారు. లేకపోతే మంత్రి పదవి విషయంలోనే ఇలా చేసిన పార్టీ రేపు లోకల్ బాడీ ఎన్నికల్లోనూ ఇదే చేస్తే మా పరిస్థితి ఏంటని హైరానా పడుతున్నారు. మంత్రి పదవి ఒకరి దగ్గరుండి, జిల్లా అధ్యక్ష పదవి ఒకరి దగ్గర ఉంటే స్థానిక ఎన్నికల్లో మాకు కష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నరు. ఒకరు టికెట్ ఇస్తే మరొకరు క్యాన్సల్ చేయరని నమ్మకం ఏంటని.. ఈ ఇద్దరి మధ్య మేం నలిగిపోక తప్పదని వాపోతున్నరు. మరి ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటుందా. మంత్రి పదవి విషయంలో సాధ్యమైనంత త్వరగా ఏదో ఒకటి తేలుస్తుందా? ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇస్తుందా? లేకపోతే జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోతుంటే చూస్తూ మిన్నకుండి పోతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.




ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు



నార్నూర్ పోలీస్ స్టేషన్‌లో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

# అరెస్టుల పర్వం

## బీఆర్ఎస్ నాయకులు ముందస్తుగా ఠాణాకు తరలింపు

పెంబి, నవంబర్ 18 : లగచర్లలో గిరిజనుల అరెస్టుకు నిరసనగా చలో కొడంగల్ కార్యక్రమానికి వెళ్లకుండా ఆదివారం రాత్రి లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు, బీఆర్ఎస్ మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేయడంతో సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు కున్సోత్ విలాస్, నాయకులు చెర్పూరి సుధాకర్, విక్రమ్‌నాయక్, రాంసింగ్ నాయక్, దశరథ్, గాండ్ల శంకర్ పాల్గొన్నారు.

### నార్నూర్ మండలంలో..

నార్నూర్, నవంబర్ 18 : ఢిల్లీకి వెళ్లేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి నార్నూర్, గాదిగూడ మండలాల పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, గాదిగూడ వైస్ మాజీ ఎంపీపీ మర్శివనే యోగేశ్, భీంపూర్ మాజీ సర్పంచ్ రాథోడ్ విష్ణు, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసీం, పట్టణాధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్, ఉపాధ్యక్షుడు రాథోడ్ శివాజీ, నాయకులు సుల్తాన్‌ఖాన్, రాథోడ్ సుభాష్, షేక్ మసూద్, ఆడే సుభాష్, ఆడా రాజేశ్వర్, మాజీ ఉప సర్పంచ్ దిగంబర్ పాల్గొన్నారు.

### ఇంద్రవెల్లి మండలంలో..

ఇంద్రవెల్లి, నవంబర్ 18 : సోమవారం లగచర్లకు జాతీయ ఎస్టీ కమిషన్ రానున్న నేపథ్యంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీసులు ఉదయమే అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మారుతి పటేల్ డోంగ్రే, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అమ్జద్, బీఆర్ఎస్ పార్టీ మండల కో-ఆర్డినేటర్ షేక్ సుఫియాన్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మిర్జా జిలానీ బేగ్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ధనరాజ్, నాయకులు కేంద్రే శ్యామ్ ఉన్నారు. అనంతరం వీరిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

### గుడిహత్నూర్ మండలంలో..




గాదిగూడ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

గుడిహత్నూర్, నవంబర్ 18 : లగచర్ల గ్రామంలో పేద రైతుల భూములను ప్రభుత్వం లాక్కోవడం సరైన పద్ధతి కాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండె అన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు బాధిత రైతులకు మద్దతు తెలిపితే పోలీసులు అరెస్టు చేశారని ఆయన పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో మండల ప్రజా పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్, మాజీ ఎంపీపీ జాదవ్ భీంరావ్ నాయక్, సిద్ధార్థ్ ఉన్నారు.



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు



గుడిహత్నూర్‌లో బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

# రేవంత్ పాలనలో బీసీల మనుగడకు ప్రమాదం

- బీసీ రిజర్వేషన్‌లలో స్పష్టత లేకుంటే ప్రభుత్వాన్ని అడ్డుకుంటాం..
- 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలి..
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామన్న

ఎదులాపురం, నవంబర్ 18 : సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో బీసీల మనుగడకు ప్రమాదం పొంచి ఉందని, బీసీ రిజర్వేషన్లలో స్పష్టత లేకుంటే ప్రభుత్వాన్ని అడ్డుకుంటామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న స్పష్టం చేశారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు నేతలతో కలిసి ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత బీసీలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. అలాగే బీసీ రిజర్వేషన్లపై కమిషన్‌ల పేరిట కాలయాపన చేస్తోందన్నారు. ఈ ఏడాది మార్చిలో బీసీ కమిషన్ ఏర్పాటుపై అసెంబ్లీలో తీర్మానం చేస్తే.. సెప్టెంబర్‌లో కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. హైకోర్టు ఆదేశిస్తే.. తాజాగా నవంబర్‌లో మరో డెడికేషన్ కమిషన్ వేశారని గుర్తు చేశారు. రిజర్వేషన్ల అంశాలపై ట్రిబుల్ టెస్ట్ ప్రాతిపదికన అని గతంలోనే సుప్రీంకోర్టు అనేక మార్లు తీర్పును ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తాజాగా బీహార్ సర్వే రిపోర్ట్‌ను కూడా న్యాయస్థానం కొట్టివేసిందన్నారు. ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా బీసీలు రిజర్వేషన్లకు దూరమయ్యే పరిస్థితి నెలకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేకు, కమిషన్‌కు సంబంధం లేదన్నారు. కమిషన్ సభ్యులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి సర్వే జరిపితేనే స్పష్టత వస్తుందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కమిషన్‌ల పేరిట కాలయాపన చేయకుండా బీసీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ సమావేశంలో బీసీ పట్టణాధ్యక్షుడు దాసరి రమేశ్, మాజీ ఎంపీపీ సేవ్వా జగదీశ్, కౌన్సిలర్ అశోక్ స్వామి, పందిరి భూమన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న